క్లుప్తంగా

పాఠశాలలో బాలమేళా



ఎగ్జిబిట్లను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఇల్లెందురూరల్: మండలంలోని సుభాష్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం బాలమేళా కార్యక్రమం నిర్వహించారు. ఈ విద్యాసంవత్సరంలో విద్యార్థులకు ప్రయోగాత్మకంగా బోధించిన బోధన సామగ్రి, విద్యార్థుల చేత తయారు చేయించిన పలు రకాలైన పట్టికలను బాలమేళాలో ప్రదర్శించారు. ఆయా అంశాలపై ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. హెచ్‌ఎం దేవదత్తం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



వ్యాపారులతో మాట్లాడుతున్న అధికారులు

టేకులపల్లి: టేకులపల్లి మండల కేంద్రంలో వ్యాపారులు నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని టేకులపల్లి ఎంపీడీఓ జి.రవీంద్రరావు, ఎస్‌ఐ పోగుల సురేష్ హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలో పర్యటించారు. నిబంధనలకు విరుద్ధంగా కాలువలు దాటి రోడ్డుపై సరుకులు పెట్టి వ్యాపారాలు చేస్తున్న వారిని గుర్తించి మందలించారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నోటీసులు జారీ చేశారు. నిత్యం సెంటర్‌లో పరిశీలన ఉంటుందని, కాలువ దాటి వ్యాపారాలు చేయడం వల్ల పార్కింగ్‌కు స్థలం లేకపోవడం, ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందికరంగా మారుతోందని, తద్వారా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు.

15న సెలవు మంజూరు చేయండి..



ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జూలూరుపాడు: 15న శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి సందర్భంగా ప్రత్యేక సెలవు మంజూరు చేయాలని టీఎస్‌టీటీఎఫ్ మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఎంఈఓ బి.జుంకీలాల్‌కు వినతిపత్రం అందజేశారు. సంఘం మండల అధ్యక్షుడు గుగులోత్ సీతారాములు, ధరావత్ హనుమా మాట్లాడుతూ... కులగణన సర్వే చేసిన ఉపాధ్యాయులకు సీసీఎల్ మంజూరు చేయడంతోపాటు, పారితోషికం ఇప్పించాలన్నారు. 2022-2024 సమ్మర్‌లో డ్యూటీ చేసిన ఉపాధ్యాయులకు సంపాదిత సెలవులు ఇవ్వాలన్నారు. శ్రీను, డి.భాస్కర్, కృష్ణ, గోపాల్, బి.నేతాజీ, డి.స్వరూప, నరసింహారావు, అరుణ పాల్గొన్నారు.

తునికాకు సేకరణ చేపట్టండి..

సింగరేణి(కొత్తగూడెం): తునికాకు సేకరణ పనులను తక్షణమే చేపట్టాలని, టెండర్ల ప్రక్రియ పనులు పూర్తిచేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గిరిజనులు, గిరిజనేతర పేదలకు తునికాకు సేకరణ రెండో ప్రధాన పంటగా ఉంటుందని, తునికాకు టెండర్లను నిర్వహించటంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని, వెంటనే టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి ఆకు సేకరణ పనులు చేపట్టాలని పేర్కొన్నారు. ఫిబ్రవరిలో ప్రూనింగ్, టెండర్ల ప్రక్రియ చేస్తే ఫలితాలు ఎక్కువగా వచ్చే అవకాశం ఉందన్నారు.

క్షయ వ్యాధిపై ప్రజలకు అవగాహన



మాట్లాడుతున్న వైద్యాధికారి దినేష్

టేకులపల్లి: క్షయ వ్యాధిపై ప్రజలు అవగాహన పెంచుకుని ఆరోగ్యంగా ఉండాలని సులానగర్ పీహెచ్‌సీ వైద్యాధికారి కందుల దినేష్ అన్నారు. ఈ మేరకు సోమవారం సులానగర్ పంచాయతీ, ముత్యాలంపాడు క్రాస్ రోడ్డు గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామాల ప్రజలకు నిక్షయ్ శివిర్ కార్యక్రమంలో భాగంగా క్షయ వ్యాధిపై అవగాహన కల్పించారు. వైద్యాధికారి మాట్లాడుతూ.. క్షయ వ్యాధి రక్త ప్రసరణ జరగని గోరు, వెంట్రుకలకు తప్పించి శరీరంలోని అన్ని భాగాలకు సోకుతుందని, ఎక్కువగా ఊపిరితిత్తులకు సోకుతుందని తెలిపారు. వజ్జా పార్వతి, చంద్రకళ, దేవా, శంకర్, పవిత్ర, శ్వేత పాల్గొన్నారు.

గ్రంథాలయాలు



పల్లెకు దూరమేనా..?

చదువు.. చీకటిలో చంద్రబింబం.. వేకువలో సూర్యదీపం.. దారి తప్పిన మనిషికి ఓ గమ్యస్థానం.. అలాంటి చదువు విలువను గుర్తించిన వారు ఉన్న వనరులను సద్వినియోగం చేసుకొని పట్టభద్రులయ్యారు. కానీ జీవితంలో స్థిరపడేందుకు ఇది సరిపోదు. పోటీ పరీక్షల గట్టెక్కాలి. ఇందుకు మంచి పుస్తకాలను సేకరించి విజ్ఞానం పెంపొందించుకోవాలి. ఆర్థికంగా ఉన్న వారికి ఇది సులువే. కానీ పేదవర్గాలకు శక్తికి మించింది. ఇలాంటి వారికోసం పల్లెల్లో గ్రంథాలయాలను ఏర్పాటు చేస్తుంటారు. కానీ నేడు ఈ సౌకర్యం అందడం లేదు.

- గ్రామాల్లో కనిపించని విజ్ఞాన భాండాగారాలు
- పోటీ పరీక్షల సన్నద్ధతలో వెనుకబాటు
- ఉద్యోగాలకు దూరమవుతున్న గ్రామీణ యువత



కొమరారం గ్రామపంచాయతీ కార్యాలయం

ఇల్లెందురూరల్: గతంలో ప్రతీ గ్రామపంచాయతీకి ఒక విజ్ఞాన భాండాగారం ఉండేది. పిల్లలు, పెద్దలు అక్కడకు చేరి ప్రపంచ సమాచారాన్ని తెలుసుకొని విజ్ఞానం పొందేవారు. యువత ఉద్యోగ సమాచారం తెలుసుకొని పోటీ పరీక్షల పుసక్తాలను పఠిస్తూ సన్నద్ధం అయ్యేవారు. నాటి పాలకులు గ్రంథాలయాల ఆవశ్యకతను గుర్తించి సమకూర్చిన సౌకర్యం ఇది. కానీ నేడు గ్రంథాలయ సంస్థ చిన్నచూపు గ్రామపంచాయతీ పాలకవర్గాల పట్టింపులేవడంతో నేడు ఏ పల్లెలోనూ ఈ సౌకర్యం కనిపించడం లేదు.

పన్ను రూపంలో ఏటా రూ.కోటి...

జిల్లాలోని 481 గ్రామపంచాయతీల పరిధిలో ఏటా సుమారుగా రూ.20 కోట్లు మేర ఇంటి పన్నులు వసూలు చేస్తున్నారు. వాటి నుంచి 8శాతం గ్రంథాలయ పన్నుగా జిల్లా గ్రంథాలయ సంస్థ అకౌంట్‌లో స్థానిక సంస్థల అధికారులు జమ చేస్తున్నారు. ఇలా ఏటా రూ.కోటికి పైగా పల్లెల నుంచి గ్రంథాలయ సంసకు నిధులు చేరుతున్నాయి. కానీ జిల్లా వ్యాప్తంగా గ్రామీణ గ్రంథాలయాలు, పుస్తక నిక్షిప్త కేంద్రాల ఊసే ఎక్కడా లేదు. జిల్లాలోని 22 మండలాలు ఉండగా ప్రస్తుతం 17 శాఖ గ్రంథాలయాలు మాత్రమే ఉన్నాయి. అంటే ఐదు మండల కేంద్రాలలో కనీసం గ్రంథాలయాలు కూడా ఏర్పాటుకు నోచుకోలేదు. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం సేవలు అందితేనే పన్నులు వసూలు చేయాలి. కానీ సేవలు అందించని గ్రంథాలయాలకు కూడా పన్ను చెల్లిస్తున్నారు పల్లెవాసులు.

ఉద్యోగాల సన్నద్ధతలో ఇబ్బంది...

గడిచిన ఏడాదిగా ప్రభుత్వపరంగా ఉద్యోగ నోటిఫికేషన్లు వరుసగా వెలువడ్డాయి. రానున్న రోజుల్లో మరికొన్ని వెలువడే అవకాశం ఉంది. ఉద్యోగాలను అందిపుచ్చుకునేందుకు గ్రామీణ ప్రాంతాలలో సౌకర్యాలు సక్రమంగా లేక నిరుద్యోగులు పట్టణ ప్రాంతాలకు వలస పోవాల్సిన దుస్థితి నెలకొంది. ఆర్థికంగా కొంత మెరుగ్గా ఉన్నవారు కోచింగ్ సెంటర్లలో చేరి పోటీపరీక్షలను సమర్థవంతంగా ఎదుర్కొంటుండగా.. పేదరికం మాటున మగ్గుతున్న నిరుద్యోగ యువత పల్లెలకే పరిమితమై ఉద్యోగ ప్రయత్నాల్లో విఫలమవుతున్నారు. కొందరు పేదలు ఉపాధి హామీ పనులకు వెళ్లి ఎంతో కొంత సంపాదించి పోటీ పరీక్షల పుస్తకాలు సేకరించుకొని పరీక్షలకు సిద్ధమవుతున్నారు. ఇలా సిద్ధమైన వారిలో ఒకటి, రెండు మార్కుల తేడాతో ఉద్యోగాలకు దూరమైన వారూ లేకపోలేదు.

పంచాయతీ కేంద్రంగా..

ప్రస్తుతం ప్రతీ 500 జనాభాకు ఒక గ్రామపంచాయతీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. పరిపాలన సౌలభ్యం కోసం ఈ ఏర్పాటు చేసిన అధికారులు ప్రతీ గ్రామపంచాయతీకి ఒక కార్యాలయాన్ని సమకూర్చింది. పెద్దగా హంగుఆర్భాటాలు అవసరం లేకున్నా ఉన్న పంచాయతీ భవనాలలో యువతకు పోటీ పరీక్షలు, ఉన్నత చదువుల సమాచారం తెలిపేలా.. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేలా కొద్దిపాటి పుస్తకాలను అందుబాటులోకి తెస్తే అందరికీ ప్రయోజనకరమే. ఇలా సమకూర్చిన చిరు గ్రంథాలయాలను స్వచ్ఛంద సంస్థలు, సేవాదృక్పథం కలిగిన వారు, సామాజిక స్పృహ ఉన్నవారు తమకు తోచిన విధంగా యువతకు అవసరమైన గ్రంథాలను అందుబాటులోకి తెచ్చేందుకు అవకాశం ఏర్పడుతుంది. ఫలితంగా ఎంతో మంది పల్లెవాసులు ప్రయోజకులయ్యే అవకాశం లేకపోలేదు.

స్వల్ప తేడాతో ఉద్యోగం కోల్పోయా..



పేదరికంలో మగ్గుతూ టీటీసీ చదువుకున్నా. ఉద్యోగాన్వేషణలో అవసరమైన ఖర్చుల కోసం హమాలీ పనికి వెళ్లాను. గ్రంథాలయం లేక సొంతంగా పుస్తకాలు కొనుక్కొని పరీక్షలకు సన్నద్ధమయ్యా. ఇటీవల నిర్వహించిన డీఎస్సీలో కేవలం 0.06 మార్కుల తేడాతో ఉద్యోగం అవకాశాన్ని కోల్పోయాను.

– జర్పుల రమేష్, నిరుద్యోగి, బొంబాయితండా

గ్రంథాలయాలతో సత్ఫలితాలు



పుస్తక పఠనం ఊహాశక్తితోపాటు ఆలోచనా విధానాన్ని, పరిధిని, అవగాహనను, ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. కానీ నేడు గ్రామాలలో గ్రంథాలయాలు లేక యువతకు పుస్తక పఠనం దూరమై ఉద్యోగాన్వేషణ భారంగా మారింది. పాలకులు స్పందించి మినీ గ్రంథాలయాలనైనా ఏర్పాటు చేయాలి.

– ఉషారాణి, నిరుద్యోగి, పోలారం

కార్మిక వ్యతిరేక చట్టాల రద్దుకు పోరాడుదాం..



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

టేకులపల్లి: కేంద్ర ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా చేసిన చట్టాల రద్దు కోసం పోరాటాలు ఉధృతం చేద్దామని టీయూసీఐ టేకులపల్లి ఏరియా కార్యదర్శి జరుపుల సుందర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఈనెల 16న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న టీయూసీఐ జిల్లా మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ టేకులపల్లిలో సోమవారం కరపత్రాలను ఆవిష్కరించారు. మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు చెప్పిందొకటి, ఇప్పుడు చేసేది మరొకటి అన్నారు. కార్మిక చట్టాలను తుంగలో తొక్కి బడా పెట్టుబడిదారులకు ఉపయోగపడే చట్టాలను చేస్తున్నారని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు, కర్షకులకు చేస్తున్న వ్యతిరేక చట్టాలను తిప్పికొట్టేందుకు ఈ మహాసభ దోహదపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మదార్, గాంధీ, రాజేష్, సాయి, శంకర్ పాల్గొన్నారు.

లక్షల ఎకరాల భూమి పంపిణీ చేశాం..



మాట్లాడుతున్న విశ్వనాథం

పాల్వంచరూరల్: పేదలకు పదిలక్షల ఎకరాల భూమిని పంపిణీ చేసిన ఘనత సీపీఐ పార్టీదేనని రైతు సంఘం జిల్లా కార్యదర్శి ముత్యాల విశ్వనాథం అన్నారు. మండల పరిధి ప్రభాత్ నగర్‌లో సోమవారం జరిగిన సీపీఐ గ్రామశాఖ మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీపీఐ భారతదేశంలో ఆవిర్భవించి వంద సంవత్సరాలైందన్నారు. ఏ పార్టీకి కూడా ఇంత చరిత్ర లేదన్నారు. ప్రజలతో మమేకమై అనేక ప్రజాఉద్యమాలు నిర్వహించినట్లు చెప్పారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో భూస్వాముల భూములను పేదలకు పంపిణీ చేయడం జరిగిందన్నారు. అనంతరం సభలో 15మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. శాఖ కార్యదర్శి బోళ్ల ఉపేందర్‌రెడ్డి, సహాయ కార్యదర్శులుగా రేగు కృష్ణమూర్తి, గోనె క్రాంతిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, నిమ్మల రాంబాబు, శనిగారపు శ్రీనివాస్, ఆవుల సతీష్, వేల్పుల లింగయ్య, వెంకన్నచారి, సోమ రామిరెడ్డి, తిరుపతిరెడ్డి, నారాయణరెడ్డి, అనిల్, హేమలత, జ్యోతి పాల్గొన్నారు.

టీయూసీఐ మహాసభలను విజయవంతం చేయాలి

పాల్వంచ: ఈనెల 16న కొత్తగూడెం ఉర్దూఘర్‌లో జరగనున్న ట్రేడ్ యూనియన్ సెంటర్ ఇండియా (టీయూసీఐ) ప్రథమ మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా ఉపాధ్యక్షుడు గోనెల రమేష్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక జీసీసీ హమాలీ గోడౌన్‌లో హమాలీ కార్మికులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ... అసంఘటిత రంగంలో పనిచేస్తున్న హమాలీ కార్మికుల జీవితాలకు భద్రత కరువైందన్నారు. వారి ఎగుమతులు, దిగుమతుల్లో పెంపుదల లేదన్నారు. పెరిగిన రేట్లను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో కుంజా భాస్కర్, నాగేంద్ర, టి.సుధాకర్, వెంకటేష్, వీరస్వామి, నాగరాజు, వెంకన్న పాల్గొన్నారు.

రేపటి నుంచి 19వ త్రైవార్షిక మహాసభలు



మాట్లాడుతున్న మాధవనాయక్

సింగరేణి(కొత్తగూడెం): ఈనెల 12, 13వ తేదీలలో అఖిల భారత ఖదాన్ మజ్దూర్ సంఘ్ (ఏబీకేఎంఎస్ – బీఎంఎస్) 19వ త్రైవార్షిక మహాసభలు నాగ్‌పూర్‌లోని రేషింబాగ్‌లో జరగనున్నాయని బీఎంఎస్ జాతీయ నాయకుడు పి.మాధవనాయక్ తెలిపారు. సోమవారం కొత్తగూడెంలోని బీఎంఎస్ కార్యాలయంలో ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశానికి సింగరేణి కాలరీస్, నైవేలి, లిగ్నేట్ కార్పొరేషన్, సీఎంపీఎఫ్, ఏబీకేఎంఎస్ అనుబంధ యూనియన్లలో పనిచేస్తున్న ముఖ్య కార్యకర్తలు, మహిళలు, ప్రతినిధులు, పదాధికారులు సహా సుమారు 700 మంది హాజరవుతున్నట్లు చెప్పారు. ఈ మహాసభలో బొగ్గు గనుల్లో సేఫ్టీ, భద్రత వేగంగా తగ్గుతున్న శాశ్వత మానవశక్తి (మ్యాన్ పవర్), కాంట్రాక్ట్ కార్మికుల పరిస్థితి, కాలుష్యం మరియు పర్యావరణ, పరిరక్షణ, నాణ్యమైన వైద్య సౌకర్యం, సీఎంపీఎఫ్/పెన్షన్ సమస్యలపై చర్చించనున్నట్లు చెప్పారు. అదేవిధంగా భవిష్యత్ ఆందోళన కార్యక్రమాల రూపకల్పన చేయనున్నారని, కొత్త ఆఫీస్ బేరర్ల నియామకం జరుగుతుందని తెలిపారు.

నిత్యావసరాల పంపిణీ

పాల్వంచ: బాపూజీనగర్‌లోని యేసు కరుణా సువార్త మందిరం స్వచ్ఛంద సేవా సంస్థ పదో వార్షికోత్సవం సందర్భంగా సోమవారం నిత్యావసర సరుకులను అందించారు. కొత్తగూడెం స్నేహలత, సంధ్యాలత అనాథాశ్రమానికి బియ్యం, సరుకులను అందజేశారు. సంస్థ నిర్వాహకులు సురేష్, ప్రభుదాస్, సురేష్, కొండ్లె రవి, మధు, కాటయ్య బాబు, మధు, సందీప్, జాన్‌సందీప్, బబ్లూ పాల్గొన్నారు.

'స్థానికం'లో రిజర్వేషన్లు అమలు చేయాలి

కొత్తగూడెంఅర్బన్: ఏజెన్సీ ప్రాంత ఎస్సీ, బీసీ కులాలకు జెడ్పీటీసీ, ఎంపీటీసీ రిజర్వేషన్ల అమలు కొరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చించి అమలు చేయాలని కోరుతూ షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట సమితి, బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బొమ్మెర శ్రీనివాస్ మాట్లాడుతూ... ఏజెన్సీ ప్రాంత ఎస్సీ, బీసీ కులాల ఎంపీటీసీ, జెడ్పీటీసీ రిజర్వేషన్ కాంగ్రెస్ ప్రభుత్వంతో చర్చించి అమలు చేయించాలని కోరారు. 2014 నోటిఫికేషన్ ఆధారంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్ అమలు చేస్తేనే న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. శ్రీనివాసరావు, మిట్టపల్లి సాంబయ్య, భిక్షపతి ఉన్నారు.

విద్యార్థులు లక్ష్యాలను సాధించాలి



బహుమతులు అందజేస్తున్న శ్రీనివాస్

సింగరేణి(కొత్తగూడెం): విద్యార్థులు నేటి పోటీ ప్రపంచానికి తగిన లక్ష్యాన్ని ఎంచుకొని వాటి సాధన కోసం కృషి చేయాలని, ఇష్టపడి చదవితే ఫలితాలు వాటంతట అవే వస్తాయని సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీ గుండా శ్రీనివాస్ సూచించారు. సోమవారం కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్‌లోని సింగరేణి ప్రధాన ఉన్నత పాఠశాలలో సింగరేణి పాఠశాల 49వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మాట్లాడుతూ.. రానున్న విద్యా సంవత్సరంలో సీబీఎస్‌ఈ సిలబస్‌ను ప్రవేశపెట్టనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా వివిధ అంశాలలో, పోటీల్లో రాణించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

మోడల్ మార్కెట్‌లో పరిశీలన



మార్కెట్‌ను సందర్శిస్తున్న ఎమ్మెల్యే కనకయ్య

ఇల్లెందు: పట్టణ నడిబొడ్డున గల మోడల్ మార్కెట్‌ను ఎమ్మెల్యే కోరం కనకయ్య సందర్శించి పరిశీలించారు. సోమవారం మార్కెట్‌లో జరుగుతున్న నిర్మాణాలను పరిశీలించిన ఆయన పలు సలహాలు సూచనలు చేశారు. త్వరితగతిన ప్రహరీ నిర్మాణం పూర్తిచేయాలని, చిరువ్యాపారుల కోసం షెడ్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... 96 మందికి వ్యాపారులకు మోడల్ మార్కెట్‌లోని కింది అంతస్తులో గదుల కేటాయింపు పూర్తి చేశామని తెలిపారు. ఎమ్మెల్యే వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ బానోతు రాంబాబు, కాంగ్రెస్ నాయకులు మడుగు సాంబమూర్తి, బొల్ల సూర్యం, మండల రాము, పూనెం సురేందర్, మాజీ సర్పంచ్ రాము, పెండ్యాల రాజు, శివ, ఉల్లింగ సతీష్, మూతి కృష్ణ, ఏఈ శంకర్ ఉన్నారు.

ట్రేడ్ లైసెన్స్‌లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం పట్టణ పరిధిలో వ్యాపారం నిర్వహించే ప్రతీ యజమాని ట్రేడ్ లైసెన్స్‌ను రిజిస్ట్రేషన్ చేసుకొని, పట్టణాభివృద్ధికి సహకరించాలని, లేకపోతే లైసెన్స్ లేని షాపులపై మున్సిపల్ చట్టం-2019 ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ శేషాంజన్‌స్వామి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని 36 వార్డుల్లో వ్యాపారం చేసే వారు ప్రతీ సంవత్సరం తప్పని సరిగా ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ట్రేడ్ లైసెన్స్‌ను మీ సేవా, నెట్ సెంటర్లలో వ్యాపారం వివరాలను తెలిపి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకొని ఆ రశీదును భద్రపరుచుకోవాలన్నారు.

రోడ్లపైకి పశువులను వదలొద్దు..

రోడ్లపైకి పశువులు, ఆవులు, గేదేలు వదలడం వలన రోడ్లపై వెళ్లే ప్రజలకు, వాహనదారులకు ఇబ్బంది కలిగి రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని మున్సిపల్ కమిషనర్ శేషాంజన్‌స్వామి అన్నారు. ఆ ప్రమాదాలలో పశువులకు కూడా తీవ్రమైన గాయాలు అవుతున్నాయని, ఈ విషయంలో పట్టణంలోని చాలామంది ఫిర్యాదులు చేస్తున్నారని పేర్కొన్నారు.

ఓటర్ల తుది జాబితా సిద్ధం



ఓటరు జాబితాను ప్రదర్శిస్తున్న ఎంపీడీఓ

ఇల్లెందురూరల్: ఎన్నికల సంఘం ఏ క్షణంలో ఆదేశించిన స్థానిక సంస్థల ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఇప్పటికే మండలంలోని 29 గ్రామపంచాయతీలకు సంబంధించి పంచాయతీల వారీగా ఓటరు జాబితాను ప్రదర్శించి, అభ్యంతరాలను స్వీకరించిన అధికారులు తుది జాబితాను కూడా ప్రకటించారు. ఇలా గ్రామపంచాయతీల కోసం సిద్ధం చేసిన ఓటరు జాబితా ఆధారంగా మండలంలోని 16 ఎంపీటీసీల వారీగా ఓటర్ల వివరాలతో కూడిన తుది జాబితాను సోమవారం మండల పరిషత్, గ్రామపంచాయతీ కార్యాలయాల్లో ఎంపీడీఓ ధన్‌సింగ్, ఎంపీఓ చిరంజీవి, గ్రామపంచాయతీ కార్యదర్శులు ప్రదర్శించారు. ఈ జాబితాపై అభ్యంతరాలు ఉంటే మండల పరిషత్ కార్యాలయంలో ఫిర్యాదు చేయవచ్చని ఎంపీడీఓ తెలిపారు.

సింగరేణి ఆస్తులను కాపాడుదాం..



ప్రతిజ్ఞ చేస్తున్న సెక్యూరిటీ సిబ్బంది

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో ఎస్‌అండ్‌పీసీలకు కొత్తగూడెంలోని కార్పొరేట్ శిక్షణ కార్యాలయంలో డ్రిల్ అండ్ పీటీ ఇన్‌స్ట్రక్టర్ శిక్షణ తరగతులను సోమవారం సెక్యూరిటీ జీఎం లక్ష్మీనారాయణ ప్రారంభించారు. మాట్లాడుతూ... సింగరేణిలో సెక్యూరిటీ సిబ్బందికి క్రమశిక్షణ ముఖ్యమని, దీనిని పాటించినప్పుడే మనకు గుర్తింపు వస్తుందని, ఈ శిక్షణ భవిష్యత్‌లో చాలా ఉపయోగకరమన్నారు. దీని వలన శారీరక, మానసిక దారుఢ్యం పెంపొందించుకోవచ్చన్నారు. శిక్షణలో నేర్చుకున్న ప్రతీ అంశాన్ని విధి నిర్వహణలో పాటించి సంస్థ ఆస్తులను కాపాడాలని, అదే సమయంలో సంస్థ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. అనంతరం సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డి.నారాయణరెడ్డి, జి.భాస్కర్‌రెడ్డి, జమేదార్లు, సిబ్బంది పాల్గొన్నారు.

డిజిటల్ క్రాప్ సర్వే పకడ్బందీగా చేయాలి



రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ నరసింహారావు

జూలూరుపాడు: డిజిటల్ క్రాప్ సర్వే పకడ్బందీగా చేయాలని కొత్తగూడెం ఏడీఏ నరసింహారావు అన్నారు. సోమవారం పాపకొల్లు, జూలూరుపాడు, కాకర్ల, మాచినేనిపేట (పడమటనర్సాపురం) వ్యవసాయ క్లస్టర్ల పరిధిలోని గ్రామాల్లో చేపట్టిన డిజిటల్ క్రాప్ సర్వేను జూలూరుపాడు ఏఓ దీపక్ ఆనంద్‌తో కలిసి కొత్తగూడెం ఏడీఏ నరసింహారావు పర్యటించి, పరిశీలించారు. ఈ సందర్భంగా పంటల నమోదు, విస్తీర్ణం నమోదు వివరాలను ఆరా తీశారు. మాట్లాడుతూ... భవిష్యత్‌లో పంటల నమోదును బట్టి రైతు భరోసా కార్యక్రమం నిర్వహించే ప్రక్రియ జరుగుతుందన్నారు. డిజిటల్ క్రాప్ సర్వే (డీసీఎస్) సమగ్రంగా జరగాలని, సర్వేలో ఎలాంటి లోటుపాట్లు, తప్పులు జరగరాదని ఏఈఓలను ఆదేశించారు. ఏఈఓలు విజయభాను, ఎంఏ గౌస్, సరిత, బి.గోపీకృష్ణ పాల్గొన్నారు.

జిల్లా మహాసభను జయప్రదం చేయండి..



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

జూలూరుపాడు: ఈనెల 16న కొత్తగూడెం ఉర్దూ ఘర్‌లో జరిగే ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా(టీయూసీఐ) జిల్లా ప్రథమ మహాసభను జయప్రదం చేయాలని యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి వై.గోపాల్‌రావు పిలుపునిచ్చారు. సోమవారం జూలూరుపాడు బస్టాండ్ ఆటో అడ్డా వద్ద కార్మికులతో కలిసి కరపత్రాలను ఆవిష్కరించారు. మాట్లాడుతూ... సంఘటిత, అసంఘటిత కార్మికవర్గం ఎదుర్కొంటున్న సమస్యలు, సవాళ్లను టీయూసీఐ ఎప్పటికప్పుడు అధ్యయనం చేస్తూ ఉద్యమిస్తుందన్నారు. జిల్లాలో సింగరేణి, మున్సిపల్, విద్యుత్, గ్రామ పంచాయతీ కార్మికులు, హమాలీలు, మోటార్, క్యాబ్, ఆటో కార్మికులు, ఆశా కార్యకర్తలు, మిడ్‌డే మీల్స్, కేజీబీవీ హాస్టల్ కార్మికులు, గ్రామదీపికలు, తదితర రంగాల కార్మికుల సమస్యలపై నిరంతరాయంగా టీయూసీఐ పోరాడుతుందన్నారు. జిల్లా మహాసభకు పెద్ద ఎత్తున కార్మికులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆటో, మోటార్ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు రాయల సిద్ధు, కార్మికులు మురళీ, సతీష్, వెంకటేష్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ నమూనా గృహ నిర్మాణం



నిర్మాణ పనులు చేస్తున్న కార్మికులు

ఇల్లెందురూరల్: ఇందిరమ్మ ఇళ్ల పథకం గృహ నమూనా నిర్మాణాన్ని సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రారంభించారు. హాలు, కిచెన్, ఒక పడక గది, బాత్‌రూం, టాయిలెట్ మొత్తం 400 చదరపు ఫీట్ల విస్తీర్ణంలో ఇంటిని నిర్మిస్తున్నారు. పునాది అవసరం లేకుండా పిల్లర్లతోనే బేస్‌మెట్, గోడలు, స్లాబ్ మొత్తం కాంక్రీట్‌తో షేర్‌వాల్ టెక్నాలజీలో ఇంటి నిర్మాణం చేపట్టారు. ఈ టెక్నాలజీతో ఇంటి నిర్మాణం వేగవంతంగా పూర్తవడంతోపాటు ఖర్చు కూడా తగ్గుతుందని, ఇతర నిర్మాణాల మాదిరిగా పటిష్టంగా ఉంటుందని గృహనిర్మాణ శాఖ ఏఈ డేవిడ్ తెలిపారు. వారం వ్యవధిలో నిర్మాణం పూర్తి చేస్తామని చెప్పారు. ఈ నిర్మాణాన్ని అధికారులు, ప్రజలు ఆసక్తిగా తిలకించారు.